క్లుప్తంగా

'పశువులను యజమానుల సంరక్షణలో ఉంచుకోవాలి'

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని పశువుల యజమానులు పశువులను తమ ఆధీనంలో ఉంచుకోవాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గజానంద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో పశువులు రాత్రి సమయాల్లో రోడ్లపై సంచరిస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

సిర్పూర్(టి): మండలంలోని పరిగాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన యువకులు మంగళవారం ప్యాక్స్ డైరెక్టర్ కొండగొర్ల కొండయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ దండె విఠల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూకట్కార్ గౌతం, దుర్కే మనోజ్, తొండ్రే విలాస్, దిలీప్ దుర్కే, విక్రమ్‌తో పాటు మరో 20 మంది యువకులు చేరారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు.

'ఎన్నికల్లో సత్తా చాటాలి'


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రవీణ్‌కుమార్

కౌటాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగవారం రాత్రి మండలంలోని భాలేపల్లి గ్రామంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, మండల కోకన్వీనర్ ఆదే నాందేవ్, నాయకులు సోమయ్య, సత్యనారాయణ, ఆనంద్‌రావ్, ఆనంద్, సందీప్, నవీన్, ఏమాజీ తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదిని కఠినంగా శిక్షించాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కౌటాల: సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహర్ సంఘం నాయకులు మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు. వారు నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపై బూట్‌తో దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దేశంలో సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్‌కు రక్షణ లేకపోవడం దారుణమని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, నాయకులు బండురావ్, సోమయ్య, జానకీరావ్, అశోక్, ఏమాజీ, నాందేవ్, సత్యనారాయణ, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న డైలీవేజ్ కార్మికుల సమ్మె


కుమురం భీం చిత్రపటానికి పూలమాల వేస్తున్న కార్మికులు

ఆసిఫాబాద్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో పని చేసే డైలీవేజ్ వర్కర్ల సమ్మె 26వ రోజుకు చేరింది. మంగళవారం కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. చేసిన పనికి వేతనాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనాలను చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఇతర సంఘాల నాయకులు కృష్ణమాచారి, ప్రభాకర్, వసంత్ రావు, కోటయ్య, భరత్, కార్మికులు శశికళ, దివ్య, లక్ష్మి, గంగుబాయి, ప్రమీల, తిరుపతి, దివ్య, మాన్కుబాయి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కాగజ్‌నగర్‌టౌన్: మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినం సందర్భంగా కోనేరు అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

బెజ్జూర్: కోనేరు కోనప్ప జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు.

గుప్పుమంటున్న గుడుంబా!


ఇటీవల దహెగాంలో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి సామగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

- జోరుగా తయారీ కేంద్రాలు ఏర్పాటు
- ప్యాకెట్లలో తరలింపు
- దాడులు చేస్తున్నా ఆగని దందా

కౌటాల: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుడుంబా గుప్పుమంటోంది. మత్తుకు బానిసలుగా మారిన వారు కిక్కు కోసం గుడుంబా తాగుతున్నారు. ప్రభుత్వం ఇటీవల మద్యం ధరలు పెంచడంతో ఆర్థికంగా లేని పలువురు గుడుంబా వైపు చూస్తున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా గుడుంబా విక్రయిస్తున్నారు. అధికారులు చుట్టపు చూపుగా వచ్చి దాడులు నిర్వహిస్తూ మామూళ్లు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

శివారు ప్రాంతాల్లో..

జిల్లాలోని మహారాష్ట్ర సరిహద్దు మండలాలు కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ తదితర మండలాల్లో అక్రమార్కులు నాటుసారా తయారు చేస్తున్నారు. మహారాష్ట్ర, మంచిర్యాల, కాగజ్‌నగర్ పట్టణాల నుంచి నల్ల, తెల్ల బెల్లం, పటిక తీసుకొచ్చి గుడుంబా తయారు చేస్తున్నారు. మారుమూల గ్రామాల్లో అధికారుల నిఘా అంతంతమాత్రంగానే ఉండడంతో అదునుగా భావించి అక్రమార్కులు ప్రాణహిత, వార్ధా, పెద్దవాగు, పెన్‌గంగా నదుల సమీపాల్లో, గ్రామాల శివారులోని పంట చేనుల్లో, అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ స్థావరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. పలువురు అక్రమార్కులు ఇళ్ల వద్దనే యథేచ్ఛగా నాటుసారా తయారు చేస్తున్నారు. నాటుసారాను ప్యాకెట్లుగా మార్చి పోలీసుల కళ్లు గప్పి ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు.


ఇటీవల చింతలమానెపల్లిలో నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్న అధికారులు

ఓటర్ల కోసం..

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు ప్రయత్నాలు మొదలెట్టారు. ఎన్నికల వేళ గుడుంబాను ప్యాకెట్లుగా మార్చి మద్యం ప్రియులకు అందుబాటులో ఉంచుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో ఈ ఏడాది ఇప్పటి వరకు పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 200లకు పైగా మందిపై కేసులు నమోదు చేసి పలువురిని అరెస్టు చేశారు. 1200 లీటర్లకు పైగా నాటుసారా, 2 వేల కిలోలకుపైగా బెల్లంతో పాటు పటికను అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు. పలు వాహనాలను సీజ్ చేశారు.

కేసులు నమోదు చేస్తాం

స్థానిక సంస్థల ఎన్నికలను అదునుగా చేసుకొని పలువురు అక్రమార్కులు నదులు, అటవీ ప్రాంతాల సమీపాల్లో, వ్యవసాయ చేనుల్లో నాటుసారా తయారీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. నిత్యం తనిఖీలు చేసి నాటుసారా స్థావరాలపై ఉక్కుపాదం మోపుతాం. పోలీసులు, అబ్కారీ శాఖ అధికారులకు ప్రజలు సహకరించాలి. ఎవరైనా నాటుసారా అమ్మినా, తయారు చేసినా పీడీయాక్ట్ కేసులు కూడా నమోదు చేస్తాం.

–వి.రవి, ఎక్సైజ్ సీఐ, కాగజ్‌నగర్

గ్రామ సింహాలతో బెంబేలు


తిర్యాణిలో సంచరిస్తున్న కుక్కలు

- గ్రామాల్లో గుంపులుగా సంచారం
- వారంలో ఎనిమిది మందిపై దాడి
- దూరంగా తరలించాలని వేడుకోలు

తిర్యాణి: గత కొన్ని రోజులుగా గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి. గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడులకు దిగుతున్నాయి. కాగా మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా వెయ్యికి పైగా వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా ఉంది. ఇప్పటికే చాలా వరకు వీధి కుక్కలకు వివిధ రకాల వైరస్‌లు సోకి ఉండటంతో ప్రజలు వాటిని చూసి భయాందోళన చెందుతున్నారు. కుక్కల నుంచి హాని ఉందని జనావాసాలకు దూరంగా వాటిని తీసుకెళ్లి వదిలేయాలని పలువురు ఇప్పటికే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

పెరుగుతున్న సంఖ్య..

గడిచిన వారం రోజుల వ్యవధిలో మండలంలోని గిన్నెదరి, చింతపెల్లి, తలండి, రాళ్ల కన్నెపెల్లి, చెలిమల గ్రామాల్లోని ఎనిమిది మందిపై పిచ్చి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గత నెలలో సైతం అనేక మందిపై పిచ్చి కుక్కలు దాడులకు పాల్పడిన సంఘటనలున్నాయి. మండలంలో పిచ్చి కుక్కల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో పాటు విచ్చలవిడిగా దాడులకు పాల్పడుతుండటంతో ప్రజల్లో కలవరం మొదలైంది. రాత్రి పూట ఒంటరిగా ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. చిన్న పిల్లలను ఒంటరిగా బయటకు పంపలేక ప్రతీ పనిలో పెద్దలు తోడుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వీటితో పాటు పంట చేనులకు వెళ్లే మహిళలపై కూడా కుక్కలు దాడి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కుక్కలను నివారించే చర్యలు చేపట్టడంతో పాటుగా వాటిని జన సమూహాలకు దూరంగా తీసుకెళ్లి వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మల్లేశ్‌ను వివరణ కోరగా పిచ్చి కుక్కలను జనసమూహం నుంచి దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..



పిచ్చి కుక్కలు గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ జనాలపై దాడులు చేస్తున్నాయి. వాటి సంతతి వృద్ధి చెందకుండా నివారించడంతో పాటు ఉన్న వాటిని జనవాసాలకు దూరంగా తీసుకెళ్లాలని ఎన్నో సార్లు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదు. – పులి వెంకటేశ్, తలండి

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి


ఆసిఫాబాద్‌రూరల్: వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు


వాంకిడి: వాల్మీకి చిత్రపటానికి పూజలు చేస్తున్న గంగపుత్రులు

ఆసిఫాబాద్‌రూరల్: వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం మండలంలోని గుండి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ దత్తు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి ఆదికవి, రామాయణ ఇతిహాసాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్యాంరావు, ప్రవీణ్, మారుతి, సంతోష్ పాల్గొన్నారు.

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి మంగళవారం సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఐటీయూసీ నాయకులు మారం శ్రీనివాస్, ఎస్వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీర్ కృష్ణమూర్తి, డీజీఎం ఉజ్వల్‌కుమార్, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌వోడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, అధిపతులు పాల్గొన్నారు.

వాంకిడి: మండల కేంద్రంలోని గంగపుత్ర కాలనీలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాంకిడి మాజీ సర్పంచ్ బండె తుకారాం, పొగాడె మనోహర్, బాబురావు మహరాజ్, సతీశ్, డైలీ క్రికెట్ యూత్, గంగపుత్ర సంఘం సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులు కోల్‌ఇండియా పోటీల్లో రాణించాలి

రెబ్బెన: సింగరేణి క్రీడాకారులను యాజమాన్యం ఎల్లవేళల ప్రోత్సహిస్తోందని, సంస్థ కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుంటూ క్రీడాకారులు కోల్ ఇండియా పోటీల్లో రాణించాలని బెల్లంపల్లి ఏరియా జీఎం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో 92వ డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ వార్షిక క్రీడల్లో భాగంగా కంపెనీ స్థాయి క్యారమ్స్, చెస్‌పోటీలు నిర్వహించారు. ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్వోటూజీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహెరా, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సీనియర్ స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్‌వెస్లీ, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ అన్వేశ్, జనరల్ కెప్టెన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


చెస్ పోటీలు ప్రారంభిస్తున్న విజయ భాస్కర్ రెడ్డి

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

కెరమెరి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. బీజేపీ నాయకులు గ్రామాల్లోకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం పథకాలపై వివరించాలన్నారు. మండల ప్రజలు ఆశీర్వదిస్తే రానున్న ప్రాదేశిక ఎన్నికల్లో కెరమెరి జెడ్పీటీసీ అభ్యర్థిగా బీజేపీ వన్ నేషన్, వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర రావు ఉంటారన్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన నాయకులను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోవ విజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ వెంకట్, సీనియర్ నాయకుడు రాజు నాయక్, నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రావణ్, దత్తు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

'కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి'

రెబ్బెన: సివిక్ టెండర్‌లో అదనంగా కార్మికులను నియమించడమే కాకుండా సీనియర్ కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని సివిల్ కార్యాలయం ఆవరణలో సివిక్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సివిక్ పనులు దక్కించుకున్న సందరు కాంట్రాక్టర్ ఇష్టారీతిన కార్మికులపై ఒత్తిడి చేస్తూ తాను చెప్పినట్లు పని చేయాలని, లేకపోతే పని నిలిపివేస్తానని చేస్తున్న బెదిరింపులు మానుకోవాలన్నారు. గోలేటిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ కోసం సింగరేణి యాజమాన్యం గత 20 సంవత్సరాలుగా సివిక్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తోందన్నారు. టెండర్‌లో మ్యాన్ పవర్ కల్పన ఒక విధంగా ఉంటే కాంట్రాక్టర్లు తమ ఇష్టారీతిగా కార్మికులను నియమించి కార్మికులకు రోటేషన్ పద్ధతిలో పనులు కల్పిస్తున్నారన్నారు. రోటేషన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తూ అదనంగా కార్మికులను నియమిస్తూ పనిచేసే కార్మికుల కడుపు కొడుతున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని సివిల్ డీజీఎం దృష్టికి తీసుకెళ్లగా కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లకే అధికారులు వంత పాడుతున్నారన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి కార్మికులను వేధిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఏరియా అధ్యక్షుడు గోలేటి శ్రీనివాస్, కార్యదర్శి అరికిల్ల పోశం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కుమురం భీంకు ఘన నివాళి


కాగజ్‌నగర్‌టౌన్: జోడేఘాట్‌లో భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ


పెంచికల్‌పేట్: జిల్లెడలో భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదివాసీలు


ఆసిఫాబాద్‌అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు


కాగజ్‌నగర్‌టౌన్: నివాళులర్పిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: కుమురంభీం వర్ధంతి పురస్కరించుకుని కమ్మర్‌గాం, జిల్లెడ గ్రామాల్లో మంగళవారం భీం విగ్రహాలకు ఆదివాసీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జల్, జంగల్, జమీన్ కోసం భీం చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. భీం ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో కుమురం భీం వర్ధంతిని మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం, పీఆర్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో దాదానగర్‌లోని కుమురం భీం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగులు అబ్రహం, శివప్రసాద్, పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: పోరాటయోధులు, ఆదివాసీ ఆరాధ్యదైవం కుమురం భీం 85వ వర్ధంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కుమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీకనంద్, కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షులు నిఖిల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

జోడేఘాట్‌లో నివాళులు..

కాగజ్‌నగర్‌టౌన్: కెరమెరి మండలం జోడేఘాట్‌లో భీం విగ్రహానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్‌తో కలిసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జల్‌జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కులను కాపాడడానికి, నిజాం నిరంకుశ ధోరణికి వ్యతిరేకంగా పోరాడిన భీం అందరికి పూజనీయుడన్నారు. భీం మనుమడు సోనేరావు, అరిగెల నాగేశ్వర్‌రావు, కొట్నాక విజయ్ రాజు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న నాయకులు

రెబ్బెన: రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాన్ని యథావిధిగా కొనసాగించేందుకు కోర్టు అనుమతులు ఇవ్వడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు తినిపించుకున్నారు. పార్టీ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్‌తో పాటు పాలకవర్గ సభ్యులను సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు, నాయకులు శ్రీధర్, భరద్వాజ్, వినోద్‌జైస్వాల్, దుర్గారావు పాల్గొన్నారు.

నాల్గవ తరగతి కార్మికులకు వేతనాలిప్పించండి


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కెరమెరి: జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ, వసతిగృహాల్లో నాల్గవ తరగతి వర్కర్లకు వేతనాలు ఇప్పించాలని గిరిజన సంక్షేమ శాఖ, నాల్గవ తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి వడ్లూరి లక్ష్మణ్, జిల్లా ఇన్‌చార్జి జూపల్లి కృష్ణారావు, ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. మంగళవారం జోడేఘాట్‌లో వారిని కలిసి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కేబీసీ నారాయణ, కే రాంచందర్, శ్రీనివాస్, వాలుసింగ్, షౌకత్ హుస్సేన్, వసంత్, రాజలింగు, దిలీప్‌కుమార్, సోనేరావు, విఠల్, రమేశ్, బక్షి తదితరులు ఉన్నారు.


లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కిమ్స్ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 39 మంది హాజరు కాగా 23 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వారికి బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్రచికిత్సలు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అరుణ్‌లోయ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


కంటి పరీక్షకు వచ్చిన వారితో మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్